ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 1 ఏప్రిల్ 2025

గ్రూపు-1లో 64వ ర్యాంక్ సాధించిన అరుణ్‌కుమార్

● గ్రూప్-1, 2, 3 ఫలితాల్లో మెరుగైన ర్యాంక్‌లు



మంథని, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్‌సీ విడుదల చేసిన గ్రూపు-1 పరీక్షా ఫలితాల్లో మంథని మండలంలోని ఖాన్ సాయిపేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ్‌కుమార్ మల్టీ జోన్‌లో-114, జోన్-1లో 64 ర్యాంక్ సాధించారు. ఇప్పటికే విడుదలైన గ్రూప్-2 పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 35వ ర్యాంక్, గ్రూపు-3లో రాష్ట్ర స్థాయిలో 81వ ర్యాంక్ అరుణ్‌కుమార్ సాధించారు. అరుణ్‌కుమార్ 2018లో ట్రిపుల్ ఐటీ జబల్‌పూర్‌లో బీటెక్ (సీఈసీ) పూర్తి చేశారు. హైదరాబాద్, ఢిల్లీలో ఉంటూ సివిల్స్ మూడు సార్లు రాశారు. 2022లో గ్రూపు-1 నోటిఫికేషన్ రావడంతో పరీక్షకు ప్రిపేర్ అయ్యారు. అరుణ్‌కుమార్ తండ్రి లక్ష్మీనారాయణ కమాన్‌పూర్ ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎంగా పని చేస్తుండగా తల్లి మల్లేశ్వరి భట్టుపల్లిలో అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తున్నారు. అరున్‌కుమార్ గ్రూప్స్ పరీక్షల్లో సత్తా చాటడం పట్ల తల్లిండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముత్తారం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ హనుమాన్ దాస్ నాయక్ తెలిపారు. పారుపల్లికి సంబంధించి కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున పారుపల్లి, ఓడెడు వ్యవసాయ లైన్‌కు మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ఉపాధిహామీ కూలి పెంపుపై నిరాశ

● రూ. 7 మాత్రమే పెంచిన కేంద్రం
● రూ.307కు చేరుకున్న వేతనం, నేటి నుంచి అమలు
● జిల్లాలో 85 వేల మంది కూలీలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆశించిన మేరకు వేతనాలు పెంచక పోవడంతో కూలీలు నిరాశకు గురవుతున్నారు. గతేడాది 28 రూపాయలు పెంచిన ప్రభుత్వం ఈసారి కేవలం 7 రూపాయలు మాత్రమే పెంచి వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఇతర వస్తువుల ధరలు పెరుగుతుండగా, వాటికి అనుగుణంగా ఉపాధి హామీ వేతనాలు పెరగడం లేదు. యేటా కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతున్నది. 2022లో 12 రూపాయలు పెంచిన ప్రభుత్వం 2023లో రూ.15, 2024లో రూ.28 పెంచగా, ఈసారి అంతకంటే ఎక్కువగానే పెరు గుతుందని ఆశించారు. ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ వేతనం రూ.300 ఇస్తుండగా, పెంచిన 7 రూపాయలతో 307కు చేరుకున్నది. పెంచిన వేతనాలు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటిం చింది. పథకం ఆరంభంలో పూర్తి స్థాయి కూలీ 87.50 రూపాయలు ఉండగా, పద్దెనిమిదేళ్లలో 219.5 రూపాయలు పెరగడం గమనార్హం.

● 2005-06లో ఉపాధిహామీ పథకానికి చట్టబద్ధత

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు 2005-06లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి చట్టబద్ధత కల్పించింది. కూలీల వలసలను నియంత్రించి స్థానికంగానే ఉపాధి పనులను గుర్తించి పని కల్పించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని తీసుకవచ్చారు. ఈ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి ఏడాదికి 100 పని దినాలు కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. యేటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఉపాధిహామీ పథకం సిబ్బంది, అధికారులు గ్రామసభలు నిర్వహించి పను లను చేపడుతున్నారు. కేటాయించిన బడ్జెట్‌లో తప్పని సరిగా 60 శాతం నిధులను కూలీలకు వేతనాల కింద చెల్లించి, 40 శాతం నిధులను మెటీరియల్ కంపోనెంట్ పనుల కోసం వెచ్చించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద మొత్తం 206 పనులను గుర్తించారు. 18 ఏళ్లుగా ఈ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణాలు, మురికి కాలువలు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, స్వశక్తి భవనాలు, రైతువేదికలు, సెగ్రిగేషన్ షెడ్లు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, తదితర శాశ్వత పనులు చేపట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెరువుల్లో పూడికతీత పనులు మినహా వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొంది.

● జిల్లాలో 1,18,949 జాబ్ కార్డులు..

జిల్లాలోని 266 గ్రామపంచాయతీల పరిధిలో 1,18,949 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, 2,43,437 మంది కూలీలు ఉన్నారు. ఇందులో 59 వేల కుటుంబాలకు చెందిన 85 వేల మంది కూలీలు ఉపాధిహామీ పనులకు వస్తుంటారు. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 1575 మంది ఉన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం 25.55 లక్షల పని దినాల లక్ష్యం విధించగా, దానిని అధిగమించి 25.98 లక్షల పని దినాలు చేశారు. సగటున ఒక్కో కూలీకి 217.33 రూపాయల వేతనం వచ్చింది. అత్యంత ఎక్కువగా కొందరు కూలీలు రోజుకు 378.40 రూపాయల వేతనం పొందారు. ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలో 89 కోట్ల 30 లక్షల రూపాయలు వెచ్చించారు. ఇందులో కూలీలకు వేతనాల కింద 58 కోట్ల 66 వెచ్చించారు. పరిపాలన కింద 4 కోట్ల 95 లక్షల 33 వేల రూపాయలు ఖర్చు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 35 లక్షల పని దినాలను ప్రతిపాదిం చారు. నాలుగేళ్లలో ఈసారి మాత్రమే కూలీ ధర తక్కువ పెంచడంతో కూలీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీని మరింత పెంచాలని కూలీలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



గోదావరిఖని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లు ముస్లింలకు అలాయ్‌బలాయ్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. 8



ఖనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, పెద్దపల్లిలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

వైద్యరంగంలో అనుభవజ్ఞులను చూసి నేర్చుకోవాలి

- జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి

పెద్దపల్లి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో అనుభవం ఉన్న వారి నుంచి మిగతా సిబ్బంది నేర్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి అన్నారు. మండలంలోని రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణ అధికారిగా విశిష్ట సేవలు అందించిన సాంబయ్య పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో హాజరై మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సీనియర్‌లను ఆదర్శంగా తీసుకోవాలని, వారి ఆలోచన విధానాలను తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. సాంబయ్య చేసిన సేవలను కొనియాడారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిణి శ్రీవాణి, జిల్లా మలేరియా అధికారి శ్రీరాములు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కిరణ్‌కుమార్, జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి రాజమొగిలి, రాఘవపూర్ పీహెచ్‌సీ వైద్యురాలు మమత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో రాజీవ్ యువవికాసం దరఖాస్తులు స్వీకరించాలి

● ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆఫ్‌లైన్‌లో కూడా రాజీవ్ యువవికాసం దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ శాంతి కుమారితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద సర్వర్ పని చేయని పక్షంలో ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఈ పథకం మానిటరింగ్ కోసం ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం సీఎస్‌కు సూచించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ దరఖాస్తులు పరిశీలించాలని అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 2018లో ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకున్న కొందరికి యూనిట్ మంజూరైనప్పటికి సబ్సిడీ విడుదల కాలేదని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకొని సబ్సిడీ మంజూరు కాని వారు మరోసారి దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పించామని అన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రంగా రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రవి కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

● రోడ్లు, డ్రైనేజీలకు డీపీఆర్ రూపొందించండి
● నిధుల మంజూరులో ఎన్‌టీపీసీ బాధ్యతతో వ్యవహరించాలి
● పారిశుధ్య నిర్వహణ సింగరేణిదే
● సమావేశంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ,మార్చి 31(ఆంధ్రజ్యోతి): రామగుండం అభివృద్ధికి నిధులు తీసుకువచ్చే బాధ్యత తనదని, ప్రస్తుతం అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని, పనుల్లో వేగం పెంచాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అరుణశ్రీ, సింగరేణి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు రూ.80కోట్ల నిధులు అదనంగా అందుబాటులోకి వస్తున్నాయని, ప్రస్తుతం జరుగుతున్న టీయూఎఫ్ ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సింగరేణి కాలనీల్లో ఇప్పటికే ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, మరికొన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కానున్నాయన్నారు. సింగరేణి ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, రోజు విడిచి రోజు చెత్త తీసుకెళుతున్నారని, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడే చెత్త కనిపిస్తుందన్నారు. రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి టెం డర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, ఈ రహదారికి ఇరువైపులా ల్యాండ్ స్కేపింగ్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాలన్నారు. 2ఏ మోరీ నుంచి ఫైవింక్లయిన్ మోరీలను కలుపుతూ రోడ్డు నిర్మించాలన్నారు. ఈ రెండు చోట్ల వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్రీరామ నవమి వేడుక లను ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్‌టీపీ సీకి కలెక్టర్ రూ.41కోట్ల పనులకు ప్రతిపాదనలు చేస్తే రూ.8 కోట్ల ప్రతిపాదన పనులను కార్పొరేట్‌కు పంపడం బాధ్యత రాహిత్య మని, రామగుండానికి రావాల్సింది రూ.225కోట్లు అని, నిధుల మంజూ రులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా తమవైపు నుంచి కూడా అదే విధంగా ప్రతిఘటన ఉంటుందన్నారు. రామగుండం పట్టణంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, ఫ్లైఓవర్, డబుల్ రోడ్డు నిర్మాణంతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంద న్నారు. మెడికల్ కళాశాల రోడ్డు విస్తరణతోపాటు రాజీవ్ రహదారి పక్కన ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగడే నిర్మాణాన్ని చేపడుతామన్నారు. సమావేశంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ డీజీఎం రమేష్ ఠాకూర్, సీనియర్ మేనేజర్ వెంకటరెడ్డి, సింగరేణి ఎస్ఈ(సివిల్) వరప్రసాద్, ఎన్‌టీపీసీ అధికారి సూర్య నారాయణ, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్ పాల్గొన్నారు.

సాయికుమార్ హంతకులను కఠినంగా శిక్షించాలి

7



సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నాయకులు

సుల్తానాబాద్ రైస్‌మిల్లులో గంజాయి సాగు

ముగ్గురిపై కేసు నమోదు



6

రామగుండంలో రోజు నీటి సరఫరాకు ప్రణాళికలు

● నాలుగు ట్యాంకుల పరిధిలో ట్రయల్ రన్
● 6వేల కనెక్షన్లకు రోజూ నీటి సరఫరా
● మిగతా ట్యాంకుల పరిధిలో నీటి సరఫరాకు యోచన
● మరో మూడు ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు

కోల్‌సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): తలాపునే గోదావరి... నగరం పక్కనే ఎల్లంపల్లి ప్రాజెక్టు అయినా రామగుండానికి రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతోంది... రామగుండం కార్పొరేషన్‌లో 40,728 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. రోజు నీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. ఎట్టకేలకు యంత్రాంగంలో కదలిక వచ్చింది. కార్పొరేషన్‌లో 13 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా ట్రయల్ రన్‌లో భాగంగా నాలుగు ట్యాంకుల పరిధిలో రోజు మంచినీటి సరఫరా మొదలుపెట్టారు. దశల వారీగా మిగతా ట్యాంకుల పరిధిలో విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

● ట్యాంకుల నిర్మాణాలకు రూ.98 కోట్లతో ప్రతిపాదనలు

కనెక్షన్లు ఎక్కువ ఉన్న రామగుండం, అశోక్‌నగర్, గోదావరి ఖని మెటర్నిటీ ట్యాంకుల పరిధిలో మరో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. మెటర్నిటీ ట్యాంకు, అశోక్‌నగర్ ట్యాంకులో వెయ్యి కిలోలీటర్లు, రామగుండంలో 500 కిలోలీటర్ల ట్యాంకులను ప్రతిపాదించారు. యూఐడీఎస్ఎస్ఎంటీ పథకం కింద రూ.98కోట్లతో ప్రజారోగ్యశాఖ ద్వారా ప్రతిపాదన చేశారు.

రామగుండం కార్పొరేషన్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం 2,29,644జనాభా ఉంది. కార్పొరేషన్ రికార్డు ప్రకారం 62వేల నివాసాలు ఉన్నాయి. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, జెన్‌కో, రైల్వే క్వార్టర్లు 17,329 ఉన్నాయి. మిగతావి ప్రైవేట్ నివాసాలు. ప్రభుత్వరంగ సంస్థల పరిధిలోని 17వేల నివాసాలకు సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, జెన్‌కోలే నీటి సర ఫరా చేస్తున్నాయి. ఈ సంస్థలకు గోదావరి నది నుంచి ప్రత్యేక నీటి సరఫరా వ్యవస్థ ఉంది. ఇక 44 వేల నివాసాల్లో 40,728 నివాసాలకు రామగుండం నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా చేస్తుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ ద్వారా రామగుండానికి నీటి సరఫరా జరుగుతుంది. రోజుకు 40 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. 40,700 మంచినీటి కనెక్షన్లు ఉండగా రోజూ 20వేల కనెక్షన్లకు మాత్రమే నీటి సరఫరా జరుగు తుంది. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా 56ఎంఎల్‌డీలు(5.6కోట్ల లీటర్లు) నీటి సరఫరాకు ఒప్పందం ఉంది. ఇందులో సింగరేణి సంస్థకు 20ఎంఎల్‌డీల (మెగా లీటర్స్ పర్ డే)నీటిని ఇవ్వాల్సి ఉండగా 36ఎంఎల్‌డీలు కార్పొరే షన్‌కు సరఫరా చేయాల్సి ఉంటుంది. సింగరేణి సంస్థకు శారదానగర్ నుంచి కొన్ని రోజులపాటు నీటి సరఫరాకు ప్రయత్నించినా అది సాధ్యపడ లేదు. దీంతో గోదావరి హెడ్‌వర్క్స్ నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రామగుండానికి రోజూ 45ఎంఎల్‌డీల నీటిని సర ఫరా చేస్తున్నారు. బీ పవర్‌హౌస్ గడ్డపై గల గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (జీఎల్‌బీ ఆర్) నుంచి గ్రావిటీ ద్వారా అన్నీ ఓవర్‌హెడ్ ట్యాం కులకు సరఫరా జరుగుతుంది. కార్పొరేషన్ పరిధిలో శారదానగర్ (24లక్షల లీటర్ల సామర్థ్యం), ఎన్ టీపీసీ హెలీప్యాడ్(17లక్షల లీటర్ల సామర్థ్యం), గోదావరిఖని మెటర్నిటీ ట్యాంకు, ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ ట్యాంకు, అశోక్‌నగర్, సంజయ్‌నగర్ ట్యాంకులు (12లక్షల లీటర్ల సామర్థ్యం) ఉన్నాయి. రామ గుండం బీ పవర్‌హౌస్, అల్లూరు, మారేడుపాక, భీముని పట్నం, సీఎస్‌పీ కాలనీ, విఠల్‌నగర్, ఎఫ్‌సీఐల్లో 10లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఉన్నాయి.

● మూడు ట్యాంకుల పరిధిలో ట్రయల్ రన్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో రోజు నీటి సరఫరాకు సంబంధించి 3ట్యాంకుల పరిధిలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఎన్‌టీపీసీ భీమునిపట్నం, న్యూమారేడుపాక, ఎల్కలపల్లి గేట్, ఎన్‌టీపీసీ హెలీప్యాడ్ ట్యాంకుల పరిధిలో రోజూ నీటి సరఫరా మొదలుపెట్టారు. భీమునిపట్నంకు సంబంధించి కార్పొరేషన్ 2, 3, 28డివిజన్ల పరిధిలోని పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మ కాలనీ, భీమునిపట్నం, అన్నపూర్ణ కాలనీల్లో నీటి సరఫరా జరుగుతుంది. మారేడుపాకలో 832కనెక్షన్లు ఉన్నాయి. 14వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురం, వీర్లపల్లి, ఎల్కలపల్లి గేట్ ప్రాంతాల్లోని ట్యాంకుల పరిధిలో 1248కనెక్షన్లకు రోజూ నీటి సరఫరా చేస్తున్నారు. హెలీప్యాడ్ ట్యాంకు పరిధిలో శాలపల్లి, కృష్ణానగర్, మల్యాపూర్‌లలో నీటి సరఫరా జరుగుతుంది. వీటితో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో రోజూ నీటి సరఫరాను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఒక్క అశోక్‌నగర్ ట్యాంకు పరిధిలోనే 5415 కనెక్షన్లు, మెటర్నిటీ ట్యాంకు పరిధిలో 11 డివిజన్లకు 5543కనెక్షన్లు ఉన్నాయి. శారదానగర్‌లో 5వేల కనెక్షన్లు, రామగుండంలో 3వేలకుపైగా కనెక్షన్లు ఉన్నాయి. ఈ ట్యాంకు పరిధిలో ఇప్పటికే నీటి సరఫరా జరుగుతున్న సమయంలో బ్యాక్ పంపింగ్ చేయాల్సి ఉంటుంది. బ్యాక్ పంపింగ్ జరిగితే కానీ నీటి సరఫరా జరుగని పరిస్థితి ఉంది. ప్రత్యామ్నాయంగా సీఎస్‌పీ కాలనీ, అల్లూరు, విఠల్‌నగర్ పరిధిలో రోజూ నీటి సరఫరాను మొదలు పెట్టేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. 13ట్యాంకులకుగాను 8ట్యాంకుల పరిధిలోనైనా రోజూ నీటి సరఫరా చేయాలనే ఆలోచనతో యంత్రాంగం ఉంది.



ఓవర్ హెడ్ ట్యాంకు

బొలేరో, కారు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు ● మూడు మేకలు మృతి



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

మానకొండూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొలేరో వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా మూడు మేకలు మృతిచెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఓదెల మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన సిద్దీఖీ(35) అనే వ్యక్తి సోమవారం కారులో హుజురాబాద్ నుంచి కరీంనగర్‌కు బయలుదేరాడు. కరీంనగర్ నుంచి జమ్మికుంటకు మేకల లోడ్‌తో బొలేరో వాహనం వెళుతోంది. ఈ రెండు వాహనాలు మానకొండూర్ మండలంలోని శంషాబాద్ గ్రామశివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మేకల లోడ్‌తో వెలుతున్న బొలేరో వాహనం బోల్తాపడి మూడు మేకలు మృతిచెందాయి. కారులోని బెలూన్స్ తెరుచుకోగా డ్రైవర్ సిద్దీఖీకి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 వాహనం సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బొలేరో వాహనం బోల్తా పడ్డప్పటికీ అందులో ఉన్న ఐదుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. అందులోని మూడు మేకలు మృతిచెందగా మరో 10 మేకలు తప్పించుకొని పారిపోయినట్లు బాధితులు తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వాహనాలను ప్రక్కకు తీసేసి రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చందుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింతపల్లి వెంకటేశ్వరరావు తనతల్లి సరోజన, కూతురు నిత్యలతో కలిసి చందుర్తి నుంచి వేములవాడకు బైక్‌పై వెళ్తున్నాడు. పెట్రోల్ బంక్ సమీపంలో హార్వెస్టర్ వాహనాన్ని ఓవర్టేక్ చేస్తున్న క్రమంలో ఓకారు అడ్డం తగలడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపారు. సరోజన పరిస్థితి విషమంగా ఉండగా 108లో వేములవాడలోని ఏరియా హస్పిటల్‌కి తరలించారు. వెంకటేశ్వరరావు, నిత్యలు స్వల్ప గాయాలయ్యాయి.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామ పరిధిలోని ఊషన్నపల్లి శివారులో సోమవారం కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండ మల్లారెడ్డి అనే రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి ద్విచక్ర వాహనంపై ఊషన్నపల్లి నుంచి లక్ష్మీపూరుకు వెళ్తుండగా గ్రామ శివారులో పెద్దంపేటకు చెందిన కారు అతివేగంగా వచ్చి ఎదురుగా ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగ్రాతుడిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

పాతకక్షతో వ్యక్తిపై దాడి



గాయాలతో కల్లెపల్లి అశోక్

పెద్దపల్లి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవ పూర్‌లో ప్రభుత్వభూమిలో చేపడుతున్న మట్టి దందాను అడ్డుకున్నాడనే కక్షతో ఆదివారం రాత్రి కల్లెపల్లి అశోక్ అనే యువకుడిపై కొందరు దాడిచేశారు. దీంతో అశోక్ తలకు తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని సోమవారం బసంత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో రాఘవపూర్ గ్రామంలోని ప్రభుత్వభూముల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని అధికారు లకు అశోక్ ఫిర్యాదు చేశాడు. దీంతో దందా చేస్తున్న వ్యక్తులు కక్షగట్టి గాయపరిచినట్లు తెలిపారు. తనకు వారితో ప్రాణహాని ఉందని, పోలీ సులు విచారణ చేపట్టి దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అశోక్ కోరారు.

గునుకులపల్లిలో వ్యక్తిపై కత్తితో దాడి..

చిగురుమామిడి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకులపల్లి శివారులో తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న బరిగెల శ్రీనివాస్‌పై సోమవారం పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన గునుకుల హరికృష్ణారెడ్డి అనేవ్యక్తి కత్తితో దాడిచేసినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బరిగెల శ్రీనివాస్, గునుకుల హరికృష్ణారెడ్డి మధ్య పాతకక్షలు ఉన్నాయి. అవి మనస్సుల్లో పెట్టకొని సోమవారం హరికృష్ణారెడ్డి, శ్రీనివాస్‌పై దాడి చేసినట్లు తెలిపారు. వెంటనే శ్రీనివాస్‌కు 108సిబ్బంది ప్రథమ చికిత్స అందించి కరీంనగర్‌కు తరలించారు. బాధితడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాతకక్షలతో హత్యాయత్నం..

శంకరపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన కొంకటి మల్లేష్ అనే వ్యక్తిని కొంకటి సుమంత్, గోదార రజినీకాంత్ అనేవ్యక్తులు పాత కక్ష్యలు మనుసులో పెట్టుకొని కొత్తగట్టు కల్వర్టు వద్ద కొట్టి చంపడానికి ప్రయత్నించారు. ఈ మేరకు కొంకటి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.



'ఫూల్స్' కాకండి..

● నేడు ఏప్రిల్ ఫస్ట్

సిరిసిల్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఫూల్స్ కాకండి.... ఆట పట్టించడానికి యువతీ యువకులు సిద్ధమవుతున్నారు. కాస్త జాగ్రత్తగా ఉంటే ఏప్రిల్ ఫూల్ నుంచి తప్పించుకోవచ్చు. ఎవరో ఒకరి మాటలకు ఫూల్స్‌గా మారుతాం. అయినా చిరునవ్వుతోనే ఆహ్వానిస్తాం. ఏప్రిల్ 1వ తేది మంగళవారం హ్యాపీగా జరుపుకునే ఫూల్స్‌డే నేపథ్యంలోకి వెళితే.. 1564 వరకు ఫ్రాన్స్‌లో సంవత్సరం జనవరి 1నుంచి కాకుండా ఏప్రిల్ 1వ తేది నుంచి ప్రారంభమయ్యేది. ఫ్రాన్స్ రాజు 9వ చార్లెస్‌కు ఈ పద్ధతి నచ్చ లేదు. అంతటా జనవరి 1 నుంచి సంవత్సరం మొదలవుతుంది కాబట్టి 1564 ఆగస్టు 9న చార్లెస్ ఒక శాసనం చేశాడు. జనవరి 1 నుంచి సంవత్సరాన్ని ప్రారంభించాలని ప్రకటించారు. ఈ మార్పునకు అలవాటు పడక కొంతమంది ఏప్రిల్ 1నే నూతన సంవత్సరం రోజుగా చెప్పుకునేవారు. ఏదైనా సందర్భంలో కూడా అలాగే రాసేవారు. దీంతో అలా రాసే వారిని చూసి హేళనగా నవ్వేవారు. దీంతో ఏప్రిల్ 1 అలా ఫూల్స్ డేగా ముందుకు వచ్చింది. క్రమేణా ఇతర ప్రాంతాల్లో కూడా ఏప్రిల్ 1ను ఫూల్స్ డేగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

మైమరిపించే బొమ్మలు

● పులి వేషాల కోసం తయారు ● ఉపాధి పొందుతున్న కళాకారులు

జగిత్యాల అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి సమీపంలో అందమైన బొమ్మలను తయారు చేస్తున్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన ధనూరి సత్తయ్య, ధనూరి సత్యనారాయణ పులి వేశాలు, చిలుకలు, గుర్రం బొమ్మలు తయారు చేస్తూ గుర్తింపు పొందారు. జగిత్యాల ప్రాంతంలో మొహర్రం సందర్భంగా పెద్ద ఎత్తున పులి వేశాలు వేస్తారు. ఇందుకు చాలా మంది మొక్కుకుంటారు. మొక్కు చెల్లించుకోవడానికి పులి బొమ్మలతో పాటు ఒళ్లంతా పసుపు రంగు పూసుకుని పులి చారలు అచ్చు వేయించుకుంటారు. పులి ఆకారం రావడానికి ఉగ్రంగా కనిపించే బొమ్మలు అవసరం. ఇలా కనిపించేందుకు నోరు తెరిచి ఉన్న పులిలా నాలుక బయటకు కనిపించే విధంగా తల తయారు చేస్తారు. మూడు కుటుంబాల వారు కలిసి సుమారు నాలుగు వందల పుర్రెల వరకు తయారు చేసి విక్రయిస్తుంటారు. అయితే ఒక్కో పుర్రెకు 25 వందల నుంచి మూడువేల వరకు తీసుకుంటారు, వీటితో పాటు పోచమ్మ ఆలయంలో అమ్మవారి మొక్కులు చెల్లించుకోవడానికి గుర్రం బొమ్మలు, చిలుక బొమ్మలను కూడా ఇక్కడ తయారు చేసి విక్రయిస్తుంటారు. సీజన్ బట్టి గిరాకీ అనుగుణంగా వీరు తయారు చేసే బొమ్మలు ఇతర ప్రాంతాల వారు కూడా తీసుకెళ్తారు. వినాయక చవితి సీజన్‌లో వినాయకుని విగ్రహాలు కూడా చేసి విక్రయిస్తుంటారు.



తయారీ దశలో పులి బొమ్మలు



గుర్రం, చిలుక బొమ్మలు

ముడి సరుకుల ధరలు పెరిగాయి

ధనూరి సత్తయ్య



కష్టానికి తగిన ఫలితం లేదు. గతంతో పోల్చితే బొమ్మల తయారీకి కావాల్సిన ముడి సరుకులు, రంగుల ధర చాలా పెరిగింది, ఖర్చుకు తగ్గ ప్రతి ఫలం రావడం లేదు. ఇప్పటి యువత ఈ కళ పట్ల ఆసక్తి చూపడం లేదు, అన్ని వృత్తులకు ఇచ్చినట్లు మా వృత్తికి కూడా ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి

ధనూరి సత్యనారాయణ



కళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించాలి. ప్రభుత్వం బొమ్మల తయారీకి కావాల్సిన ముడి సరుకులపై రాయితీ ఇవ్వాలి. అలా అయితే తాము కూడా ధర తగ్గించి అమ్మేందుకు వీలు కలుగుతుంది. ధర తక్కువ చేయడం వల్ల కొనుగోలుదారులు కూడా పెరుగుతారు.

రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటోను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామంలోని వాహన డ్రైవర్ అనరాశి దుర్గయ్యపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. ఈనెల 30న రాత్రి నారాయణపూర్ గ్రామంలోని యువకులు అవేజ్, అఫ్రోజ్‌లు కలిసి రంజాన్ పండుగకు దుస్తులు కొనుగోలు చేసేందుకు స్కూటీపై ఎల్లారెడ్డిపేట వైపు నుంచి సిరిసిల్లకు వెళుతున్నారని పేర్కొన్నారు. అటు నుంచి ఆటోలో హరిదాస్‌నగర్ వైపు వస్తున్న దుర్గయ్య అతివేగంగా యువకుల స్కూటీని ఢీకొట్టాడు. బాధితుడు అవేజ్ తండ్రి సమ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామపంచాయతీ పరిధి పోచమ్మతండాలోని గిరిజన మహిళలు ఖాళీ బిందెలను సోమవారం రోడ్డెక్కారు. ఉగాది పండుగ పూట తాగు నీరు సరఫరా కాకపోవడంతో ఆందోళనకు దిగిన మహిళలు రెండోరోజు కొనసాగించారు. సుమారు రెండు గంటల పాటు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిసమస్యను తీర్చాలని, లేనిపక్షంలో గిరిజనమహిళలతో కలిసి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ నాయకుడు రవినాయక్ హెచ్చరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి

పాలకుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి హెచ్చరించారు. సోమవారం కన్నాల టోల్ ప్లాజా వద్ద డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడుపుతున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మైనర్‌లకు ద్విచక్రవాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంటఉంచు కోవాలని, రోడ్డుభద్రతనియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు..

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాచేస్తే కఠినచర్యలు తప్పవని బసంత్‌నగర్ ఎస్‌ఐస్వామి ఒకప్రకటనలో తెలిపారు. ముంజంపల్లి శివారులోఉన్న ఇసుక స్థావరంపై దాడిచేసి రెండు టిప్పర్‌లను, ఒక ఎక్స్‌కావేటర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. బుర్రి మహిపాల్, ముంజాల సురేష్, తనుగుల తిరుపతి, తనుగులసురేష్, వాసం సతీష్, గుమ్ముల రాజేందర్ గోదావరినుంచిఇసుకను అక్రమంగా తీసుకువచ్చి ఇక్కడ నిలువ చేసి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు అనుమతులు లేకుండా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక యువతి బలవన్మరణం



శృతి (ఫైల్)

కథలాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఆకుల శృతి(30) కడుపునొప్పి భరించలేక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. శృతి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్ అవసరమని చెప్పడంతో ఆర్థిక ఇబ్బందులు శృతిని కలచివేశాయి. నాన్న శ్రీనివాస్‌కు ఐదేళ్ల క్రితం పక్షవాతం రాగా మంచానికే పరిమితమయ్యాడు. ఆపరేషన్ చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న శృతికి సోమవారం నొప్పి తీవ్రం కావడంతో మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శృతి గ్రూప్-1పరీక్ష రాయగా ఇటీవల విడుదలైన ఫలితాల్లో నిరాశే ఎదురైంది. దీంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మనస్థాపం చెంది ఉంటుందని బంధువులు పేర్కొంటున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ మద్దికుంటప్రాంతంలో ఎస్సారెస్పీ డీ86 ప్రధాన కాలువలో వృద్ధురాలి మృతదేహం లభ్యమయింది. పోలీసులు మహిళ మృతదేహాన్ని బయటకు తీయించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం చాకుంట గ్రామానికిచెందిన సాయిళ్ల లచ్చమ్మ(76)గా గుర్తించారు. లచ్చమ్మ భర్త చనిపోవడంతో తల్లిగారి గ్రామమైన ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఉంటుంది. ఇటీవల తల్లి కూడా మృతిచెందడంతో మనస్తాపంతో ఉంటుందని, దీంతోజీవితంపై విరక్తి చెంది కాలువలోదూకి ఉంటుందని కుమారుడు తిరుపతి పోలీసులకు తెలిపారు. కేసునమోదుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సుల్తానాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐతరాజ్‌పల్లి గ్రామ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన పంగ నిఖిల్(25) అనే యువకుడు మిత్రులను కలవడానికి ఆదివారం రాత్రి పదిగంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై సుల్తాన్‌పూర్ నుంచి సుల్తానాబాద్ మండలంలోని ఐదరాజ్‌పల్లి గ్రామానికివచ్చాడు. తిరిగిగ్రామానికి వెలుతుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నిఖిల్ తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్‌సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉగాది పండుగ కోసం రెండురోజుల కిందటే స్వగ్రామానికి వచ్చాడు. బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈత చెట్టు పైనుంచి పడి మృతి

జగిత్యాలరూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికిచెందిన దాసరి లచ్చయ్య(54) అనే గీతకార్మికుడు ఈతచెట్టు పైనుంచి కిందపడి మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సైతెలిపిన వివరాల ప్రకారం.. లచ్చయ్య తనపనిలో భాగంగా తక్కళ్లపల్లి శివారులోని ఈతవనంలోకి సోమవారం ఉదయం కల్లుగీయడానికి వెళ్లాడు. చెట్టుఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య దాసరిమల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి



నరసింహారెడ్డి (ఫైల్)

తిమ్మాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పొలంలో తిరుగుతున్న రైతును పాటు కాటువేయగా అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందిన సంఘటన మండలంలోని గొల్లపల్లిగ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామ స్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మెర నరసింహారెడ్డి(57) సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావివద్దకువెళ్లాడు. ఈక్రమంలోపొలంలో తిరుగుతుండగా ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యాడు. గమనించిన ఇతర రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాలతో పురుగులమందు తాగిన యువకుడు లంబ శ్రీనివాస్(29) మండల కేంద్రంలోని ఓఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శ్రీనివాస్ 3నెలల కిందట రోడ్డు ప్రమాదానికి గురై కోలుకున్నాడు. అతని భార్య సవితతో కొంత కాలంగా గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో గతనెల 18న శ్రీనివాస్ పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హుజూరాబాద్‌లో రెండుచోట్ల చోరీ

● రూ.50వేలు.., 5 తులాల వెండి ఎత్తుకెళ్లిన దొంగలు



దొంగతనం జరిగిన షాపును పరిశీలిస్తున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్

హుజూరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ఒకేరోజు రెండుచోట్ల దొంగతనాలు జరిగాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో పోరండ్ల సమ్మయ్యకు చెందిన రాఘవేంద్ర కిరాణం అండ్ జనరల్ స్టోర్, వరంగల్ రోడ్‌లోని భగవాన్‌రెడ్డికి చెందిన పరమేశ్వర ఎలక్ట్రికల్ అండ్ వైన్డింగ్ దుకాణంలో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగిందన్నారు. రాఘవేంద్ర కిరాణం షాపులో రూ.25వేల నగదు, పరమేశ్వర ఎలక్ట్రికల్ షాపులో రూ.25వేల నగదుతోపాటు 5తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ సంఘటన స్థలాలకు చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

● పోలీసులు గస్తీ కాస్తున్నారా..?

రాత్రివేళల్లో పోలీసులు గస్తీ కాస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలోని నడిబొడ్డున ఒకేరోజు ఒకే సమయంలో రెండుచోట్ల దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ కాస్తున్నప్పుడు దొంగతనాలు ఎందుకు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాలుగు ఇసుకట్రాక్టర్లు, ఎక్స్‌కావేటర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెంకటేష్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి పోలీస్‌సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతులు లేకుండా చిన్నరాతుపల్లి శివారులో హుస్సేన్‌మియావాగులో ఎక్స్‌కావేటర్‌తో ఇసుక తీస్తూ ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చందుర్తి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడి ఉంది. విధి నిర్వహణలో భాగంగా వేములవాడ నుంచి చందుర్తి వైపు వెళ్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్యలు గాయాలతో ఉన్న మహిళను గమనించి 108లో ఆసుపత్రికి తరలించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1000 ఇచ్చి మానవత్వం చాటుకున్నారు.

సుల్తానాబాద్ రైస్‌మిల్లులో గంజాయి సాగు



గంజాయి మొక్కలతో సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ తదితరులు

సుల్తానాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ శివారు సిరి ఇండస్ట్రీస్ అనే రైస్‌మిల్లులో గంజాయి సాగు వెలుగు చూసింది. పక్కా సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ సిబ్బందితో రైస్‌మిల్లులో తనిఖీ చేయగా ఐదు గంజాయి అగుపించాయి. సీఐ సుబ్బారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని గంజాయి మొక్కల ను పరిశీలించారు. గంజాయి సాగులో ఎవరి పాత్ర ఉందనే విషయం పై దర్యాప్తు చేశారు. సోమవారం ఉదయం ఈ విషయం వెలుగుచూడగా సాయంత్రం వరకు పోలీసులు విచారణ జరిపారు. ఎక్సైజ్, నార్కోటిక్ విభాగం అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు రైస్‌మిల్లుకు చేరుకుని గంజాయి మొక్కలను పరిశీలించారు. ఈ రైస్ మిల్లులో బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారని, వారు ఈ మొక్కలను తీసుకువచ్చి సాగు చేస్తూ గంజాయి సేవిస్తారని భావిస్తున్నారు. గతంలో కూడా సుద్దాల మద్దికుంట రోడ్డులో ఉన్న ఓ రైస్‌మిల్లులో కూడా గంజాయి సాగు చేసిన ఘటన బయటపడింది.

ముగ్గురిపై కేసు నమోదు

ఈ ఘటనకు సంబంధించి ముగ్గురి పై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. రైస్‌మిల్లులో పెంచుతున్న మొక్కలకు సంబంధించి కాట్నపల్లి గ్రామానికి చెందిన మేకల పవన్ కళ్యాణ్, బీహార్‌కు చెందిన లాల్ అరోబిహార్‌తోపాటు సిరి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ఓనర్ అయిన మట్ట శ్రీనివాస్‌రెడ్డి పై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రావణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అలరించిన కవితాగానం



కవి ఆడెపు లక్ష్మణ్ సత్కారం

సిరిసిల్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు కవుల కవితాగానం అందరిని అలరించింది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆదివారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో సిరిసిల్ల మానేరు కవులు, రచయిత, కవి జూకంటి జగన్నాథం తొలి సదస్సులో కవితాగానం చేశారు. మానవ సమాజంలో చరవాణి ఒక భాగమైపోయిందంటూ కవితలు వినిపించారు. రెండవ సదస్సులో డాక్టర్ పత్తిపాక మోహన్ సిరిసిల్లలోని నేత కార్మికులకు అన్నం దొరికినపుడే అసలైన ఉగాది అంటూ కవితలు వినిపించారు. యువ కవులు ఆడెపు లక్ష్మణ్, ఈడెపు సౌమ్యలు నిరుపేద కళ్లల్లో ఆనందం కనిపించినపుడే ఉగాది అంటూ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా కవులను భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ సన్మానించి జ్ఞాపికలు అందించారు. వారిని సిరిసిల్ల మానేరు రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, జిందం అశోక్, దూడం గణేష్, అంకారపు రవి, అన్నల్‌దాస్ కరుణాకర్ అభినందనలు తెలిపారు.



సత్కారం అందుకుంటున్న కవయిత్రి సౌమ్య

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు వేళాయె



• పదో తరగతి విద్యార్థులకు అవకాశం
• టీజీఆర్‌జేసీ సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

చొప్పదండి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి టీజీఆర్‌జేసీ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బాలురకు 15, బాలికల కోసం 20 గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. ఇటీవల పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడా నికి అర్హులు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఆన్‌లైన్‌రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

పరీక్ష విధానం

టీజీఆర్‌జేసీ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. విద్యార్థులు ఎంచుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలడుగుతారు. ఎంపీసీ విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ నుంచి, బైపీసీ విద్యార్థులకు ఇంగ్లిష్, బయోలజికల్ సైన్స్, ఫిజిక్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఎంఈసీ గ్రూప్ వారికి ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, మ్యాథ్స్ సబ్జెక్టుల నుంచి పదోతరగతి స్థాయిలో ఒక్కో సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

పరీక్ష కేంద్రాలు

ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తుకు చివరితేదీ: 23 ఏప్రిల్, 2025

ప్రవేశ పరీక్ష తేదీ: 10 మే, 2025

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

విద్యార్థులు ఏప్రిల్ 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మే 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పొందుతారు. ప్రవేశ పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 040-24734899 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

గ్రూప్‌లు, సీట్ల వివరాలు

ఎంపీసి, బైపీసీ, ఎంఈసీ గ్రూప్‌లలో 2,996 సీట్లు ఉంటాయి. ఎంపీసీలో 1,496, బైపీసీ 1,440, ఎంఈసీలో 60 సీట్లు ఉంటాయి. ఎంఈసీలో 30 సీట్లు యాదాద్రి భువనగిరి జిల్లా సర్వైల్ (బాలురు) గురుకుల కళాశాల, మరో 30 సీట్లు హన్మకొండ జిల్లా హసన్‌పర్తి (బాలికలు) గురుకుల కళాశాలలో మాత్రమే అందు బాటులో ఉన్నాయి. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను tgrjc.cgg.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు ఫీజు 200 రూపాయలు చెల్లించాలి. ప్రవేశపరీక్ష ర్యాంకు, రిజర్వేషన్ల ఆధారంగా కళాశాలలోకి ప్రవేశాలు కల్పిస్తారు.



కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు



రెండు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే బాల వాటిక, ఒకటో తరగతిలో ప్రవేశాల ప్రకియ పూర్తయ్యింది. ప్రస్తుతం రెండు నుంచి తొమ్మిదో తరగతుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. కరీంనగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఏప్రిల్ 2 నుంచి 11 వరకు దరఖాస్తు చేసుకోనుకోవచ్చు.

● **అర్హతలు:**

రెండో తరగతిలో ప్రవేశానికి 01-04-2025 నాటికి ఏడు సంవత్సరాలు నిండి తొమ్మిది సంవత్సరాల లోపు వయస్సు ఉండాలి. మూడో తరగతికి ఎనిమిది నుంచి 10, నాలుగో తరగతికి తొమ్మిది నుంచి 11 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు అర్హులు. అయిదో తరగతికి తొమ్మిది నుంచి 11 సంవత్సరాలు, ఆరో తరగతికి 10 నుంచి 12, ఏడో తరగతికి 11 నుంచి 13, ఎనిమిదో తరగతికి 12 నుంచి 14, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి 13 నిండి 15 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు అర్హులు. రిజర్వుడ్ కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు, తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న బాలికలకు ప్రాధాన్యం ఉంటుంది.

● ఏప్రిల్ 2 నుంచి 11వ తేదీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. 18 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

కారు ఢీకొని యువకుడి మృతి

ధర్మపురి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సయ్యపల్లె బస్ స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై బైకును వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి కారు ఢీకొట్టిన ప్రమాదంలో తొందుర్తి రాజేందర్ (25) సోమవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన తొందుర్తి రాజేందర్ ధర్మపురి పట్టణంలోని ఒక ఫర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. షాపు బంద్ చేసిన అనంతరం రాత్రి తన స్వగ్రామమైన తుమ్మెనాలకు ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. ఆ సమయంలో మంచిర్యాల జిల్లా దండేపల్లి గ్రామానికి చెందిన కారు అతివేగంగా అజాగ్రత్తగా నడిపిన ఓ వ్యక్తి వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కొడుకు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శవ పంచనామా జరిపి, పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

కోటేశ్వర స్వామికి భక్తుల పూజలు

వెల్గటూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వరస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొదట కాశీ శివలింగానికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని త్రిమూర్తుల స్వరూపమైన రావి, జువ్వి, వేప చెట్లకు ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు భక్తులతో పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. కొందరు భక్తులు పంచామృతం, ధాన్యాలతో అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సాయికుమార్ హంతకులను కఠినంగా శిక్షించాలి



హత్య స్థలాన్ని పరిశీలిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

ఎలిగేడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోటలో ప్రేమ పేరుతో ఈనెల 27న జరిగిన సాయికుమార్ దారుణ హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పౌర హక్కుల సంఘం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ముప్పిరి తోట గ్రామాన్ని సందర్శించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం సాయికుమార్ తల్లిదండ్రులు పూరెళ్ల జోత్స్న పర్శరాంగౌడ్‌లను పరామర్శించారు. వారు మాట్లాడుతూ గతంలో రెండు సార్లు సాయికుమార్‌పై దాడి చేసిన సందర్భంలో పోలీస్‌లు స్పందిస్తే బాగుండేదన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి హంతకులను శిక్షించి మిగితా ఇద్దరు చీకటి హరీష్, చీకటి మల్లయ్యను అరెస్టు చేయాలన్నారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య గౌడ్, పౌర హక్కుల సంఘం నాయకులు బొంకూరి లక్ష్మణ్, పుట్ట రాజన్న, సత్యనారాయణ, రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి శిక్షించాలి

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): పూరెళ్ళ సాయి కుమార్‌ది పరువు హత్య కాదని, కుట్రపూరితంగా చేసిన హత్యేనని పౌరహక్కుల, విప్లవ రచయితల సంఘం, తెలంగాణ ప్రజాఫ్రంట్, దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ గౌడ కులానికి చెందిన సాయికుమార్, అదే గ్రామం ముదిరాజ్ కులానికి చెందిన అమ్మాయి రెండేళ్ళుగా ప్రేమించుకుంటున్నారని పేర్కొన్నారు.

ప్రేమ వ్యవహారం ఇష్టం లేని అమ్మాయి తలిదండ్రులు ముత్యం సమత, సద య్య, బంధువు సిద్ధ సారయ్య, చీకటి మల్లయ్య, చీకటి హరీష్‌ల ప్రోద్బలంతో హత్యకు కుట్రపన్నారని పేర్కొన్నారు. సమాజం లో ప్రేమ, కులం, మతం పేరుతో జరిగే పరువు హత్యలు, దాడుల నివారణకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముప్పిరితోట ఘటనపై సమగ్ర విచారణ జరిపించి హంతకులను కఠినంగా శిక్షించాలని, మిగితా ఇద్దరినీ అరెస్ట్ చేయాలన్నారు. కేసు విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని, సాయికుమార్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం నాయకులు బొంకూరి లక్ష్మణ్, ఎస్. సత్యనారాయణ, పుట్ట రాజన్న, రెడ్డిరాజుల సంపత్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

• పాఠశాలల్లో వంట గదులు లేక ఇబ్బందులు • చెట్ల కిందే వంటలు • వానాకాలంలో తీవ్ర ఇక్కట్లు

కథలాపూర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అసలే చాలీచాలని కమిషన్‌తో ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులకు వంట గదుల్లేక మరింత ఇబ్బందులు పడుతున్నారు. లేని కారణంగా చెట్ల కిందే వంటలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా సర్కారు బడుల్లో వసతుల కల్పనపై దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. కథలాపూర్ మండలంలో 30 మండల పరిషత్, 10 జిల్లా పరిషత్, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా దాదాపు 15 పాఠశాలల్లో వంట గదుల సమస్య నెలకొందని పేర్కొంటున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన వంట గది

భోజన నిర్వాహకులు వంట చేయడానికి అవసర మయ్యే సరుకులు నిల్వ చేసుకోడానికి గదులు అవస రం. సరుకులు ఎక్కడ పెట్టుకోవాలో తెలియక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వానాకాలంలో వంటలు చేయడం గగనంగా మారుతోంది. తరగతి గదుల మధ్య చిన్న ఇరుకుగా ఉన్న సందుల్లో వంటలు చేస్తు న్నారు. గతంలో ప్రభుత్వాలు ఉపాధి హామీ, ఎస్ ఎఫ్‌సీ పథకాల కింద వంట గదుల కోసం నిధులు మంజూరు చేశాయి. అయితే ఎస్ఎంసీ చైర్మన్లు, కాం ట్రాక్టర్లు పనులను అర్ధంతరంగా వదిలేయడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. 'మన ఊరు-మనబడి' కార్యక్ మం కింద సిరికొండ, కథలాపూర్ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి డైనింగ్ హాళ్లకు నిధులు కేటాయించింది. అయితే కాంట్రాక్టర్లు నిధులు విడుదల కావడం లేదనే కారణంగా పనులు నిలిపి వేశారు. దీంతో పాఠశాలల వరండాల్లోనే భోజనం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ సర్కారు వంట గదుల కోసం నిధులు విడుదల చేసి అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు పూర్తి చేయించాలని నిర్వాహకులు కోరుతున్నారు.



కథలాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్

వంట గదుల సమస్య పరిష్కరించాలి

చెన్నవేని దశరథం, జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి



నామమాత్రపు కమిషన్‌తో విద్యార్థులకు వంటలు చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. ఉచితంగా సిలిండర్లు పంపిణీ చేయకపోవడం వల్ల నేటికీ కట్టెల పొయ్యిల పైనే వంటలు చేస్తున్నారు. కమిషన్ పెంచాలని ఎన్ని సార్లు ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోంది. వంట గదుల సమస్యను వెంటనే పరిష్కరించాలి.

పోచమ్మతండాలో తాగునీటి ఎద్దడి..

• ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
• అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



వ్యవసాయ బావి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామపంచాయతీ పరిధి పోచమ్మతండాలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. తండాల్లో రెండు బోరు బావులు, మిషన్ భగీరథ పథకం ఉన్నా.. గిరిజనులకు తాటి నీటికి తిప్పలు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీటి పైపుల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో వారికి బోరు బావులే ప్రధాన ఆధారంగా మారింది. బోరు బావుల్లో నీరు అడుగంటిపోవడం, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం వల్ల తండా ప్రజలు అల్లాడుతున్నారు. బిందెలతో నీటి కోసం సమీపంలోని వ్యవసాయ పొలాల వెంట పరుగులు పెడుతున్నారు. బిందెలతో వ్యవసాయ పొలాల గట్టుపై నుంచి రావడం కష్టంగా మారుతోందని వాపోతున్నారు. పోచమ్మతండాలో సుమారు 20 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 100 మంది జనాభా ఉన్నారు.

ఇటీవల తాగునీరు సరఫరా కాకపోవడంతో నిరసనకు దిగితే సంబంధిత శాఖ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు. పదిహేను రోజుల నుంచి ట్యాం కర్ల ద్వారా సరఫరా నిలిచిపోయింది. దాంతో గిరిజనులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి బిందెలతో నీటిని మోసుకు వస్తున్నారు. ఉగాది పండుగ పూట తాగునీరు లేక ఆగ్రహించిన మహిళలు బిందెలు, డ్రమ్ములు, బకెట్లు అడ్డుగా పెట్టి ఆందోళనకు దిగారు. అధికారులు స్పందించకపోవడంతో చేసేదేమీ లేక నీటి కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి కాలినడకన నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధితశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ నీటి తిప్పలు తీర్చాలని కోరారు.

మిషన్ భగీరథ నీరు రావడం లేదు

: అజ్మీరా అనూష, పోచమ్మతండా



మా తండాలో గత యేడాదిగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. తండాలో ఉన్న బోరు బావుల నుంచి నీళ్లు తెచ్చుకునేటోళ్లం. బోరు మోటారు కాలిపోయింది. నీళ్ల కోసం వ్యవసాయ పొలాల వద్దకు వెళుతున్నాం. పనులను పదులుకుని కిలోమీటరు దూరం నుంచి నీటిని తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. సార్లు పట్టించుకుని తాగు నీరు అందించాలే.

నీళ్లకు అల్లాడుతున్నాం

బానోతు లాలీ, పోచమ్మతండా



మిషన్ భగీరథ పైపులు వేసిన చుక్క నీరు వచ్చింది లేదు. ఉన్న బోరు మోటారు కాలిపోయిన సార్లు పట్టించుకుంటలేరు. తాగు నీళ్లకు అల్లాడుతున్నాం. నిత్యం పొలాల వద్దకు బిందెలు పట్టుకుని పోతున్నాం. వ్యవసాయ పొలాల రైతులు నీళ్లకు రావద్దని బెదిరిస్తుండ్రు. నీళ్లకు ఎక్కడకీ పోవాలే. మేం ఓటు వేయలేదా..? బోరును మంచిగా చేసి నీళ్ల కష్టాలు తీర్చాలే.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

దేవరాజు, గుండారం పంచాయతీ కార్యదర్శి



గుండారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మతండాలో ఉన్న రెండు బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఓ బోరు నుంచి చుక్క నీరు రావడం లేదు. తండాలోని ట్యాంకుకు నీటిని సరఫరా చేస్తున్నాం. తాగేందుకు ఇన్ని రోజులు అందించిన బోరులో నీరు అడుగంటడంతో తాగే నీటి సమస్య ఉత్పన్నమైంది. బోరు వేయించాలని గిరిజనులు కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. తాగు నీటి సమస్యను తీర్చుతాం.

పోటెత్తిన భక్తులు

వేములవాడలో రాజన్న దర్శనానికి 6 గంటల సమయం



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. కోడె మొక్కు చెల్లించుకునేందుకు కోడెమొక్కు క్యూలైన్‌లో సుమారుగా 5 గంటల పాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి వేచి ఉండి రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లో సైతం భారీగా తరలిరావడంతో స్వామి వారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులు పెద్ద సంఖ్య లో తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో లు అందుబాటులో లేక పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయానికి చేరుకుని భక్తులకు సరైన దర్శనం అందక ఇబ్బందులు పడుతున్నారని, సరిపడా సిబ్బంది లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని, భక్తులకు సరైన సేవలు అందించడంలో విఫల మవుతున్నారని ఆలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చందర్‌ను పరామర్శించిన నాయకులు


చందర్‌తో మాట్లాడుతున్న మాజీ ప్రజాప్రతినిధులు

గోదావరిఖని, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై మూడు రోజులుగా మంచిర్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌ను సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. చందర్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

నేడు పెద్దపల్లిలో ఉగాది కవి సమ్మేళనం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం ఉగాది కవిసమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఉదయ సాహితీ జిల్లా అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య, జిల్లా రచయితల సంఘం కన్వీనర్ ఏలేశ్వరం వెంకటేశం, కోకన్వీనర్ బుర్ర తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు కవి సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఔత్సాహిక కవులు, రచయితలు హాజరు కావాలని పేర్కొన్నారు.

పలువురికి ఉగాది పురస్కారాలు

పెద్దపల్లిటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి) విశ్వావసు ఉగాది సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ, యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. సోమవారం యాదవ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న యాదవులను సన్మానించామన్నారు. యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు జెకె శేఖర్ యాదవ్, శ్రీహరి యాదవ్, జాతీయ కౌన్సిల్ మెంబర్ మహేందర్ యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి


ప్రజాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు


యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బీ అశోక్ డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న హింస, దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్‌ల పేరిట జరుగుతున్న హత్యలను అన్ని వర్గాలు ఖండించాలన్నారు. ఆదివాసీ ప్రాంతాలను సైనికీకరణ చేస్తూ వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నట్టు తెలిపారు. రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరించే విధంగా జీవించే హక్కును కాలరాస్తున్నట్టు తెలిపారు. ఎన్‌కౌంటర్‌ల పేరిట కేంద్రం చేస్తున్న మారణకాండను మానుకోవాలని, ఎన్‌కౌంటర్‌లపై న్యాయవిచారణ జరిపించాలని అశోక్ డిమాండ్ చేశారు. కేంద్ర ఫాసిస్టు విధానాలకు నిరసనగా 8న జరిగే ప్రజాధర్నాకు మేధావులు, ప్రజాసంఘాలు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ప్రజాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. చందు, మదునన్న, రాజేశ్వరి, లింగయ్య, నాగరాజు, కొంరమ్మ, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్ఆర్ జన్మదినం


విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్న హరీ‌ష్‌రెడ్డి తల్లిదండ్రులు

కోల్‌సిటీటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాల హరీష్‌రెడ్డి జన్మదినోత్సవం సోమవారం రామగుండం నియోజకవర్గ పరిధిలో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ శ్రేణులు, ఫౌండేషన్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరిఖని ప్రభుత్వ హాస్పిటల్‌లో ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేశారు. రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం తబితా ఆశ్రమంలో అమ్మపరివార్ ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు అబ్బోజు రాంబాబు కుమారుడికి కాలేజీ ఫీజు నిమిత్తం ప్రతి ఏడాది ఇస్తున్నట్టు రూ.30వేల నగదును, తిలక్‌నగర్‌కు చెందిన క్యాన్సర్ పెషంట్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7000ను హరీష్‌రెడ్డి తల్లిదండ్రులు అందజే శారు. ఈకార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే రచ్చపల్లి గెజిట్‌కు కృషి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌శ్రీనివాస్, గ్రామస్థులు

మంథని, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గని విస్తరణలో నిర్వాసిత గ్రామంగా మారిన రచ్చపల్లి గ్రామస్థుల కోసం బిట్టుపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఆర్‌అండ్ఆర్ కాలనీని పంచాయతీగా ఏర్పాటు కోసం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కృషితో బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గెజిట్ విడుదల ప్రక్రియ పూర్తయిందని మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గెజిట్ విడుదల కోసం తాను అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. మంత్రి, ఆయన సోదరుడి మెప్పు కోసం మాజీ సర్పంచ్ నర్సింగరావు చేసిన వ్యాఖ్యలు అవాస్తవమన్నారు. ఈవిషయంలో ప్రజల మధ్య బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. గుర్రం సదానందం, లింగయ్య, సురేష్, కుమార్, మల్లేష్, శ్రీనివాస్, విజయ్, రాజుజ, కిషన్, గోపాల్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా అట్రాసిటి కేసు పెట్టారు

మంథని, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తనపై అక్రమంగా అట్రాసిటీ కేసు పెట్టారని ముత్తారం మండలానికి చెందిన తీర్థాల కొమురయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 21న పొలంలో మట్టి తీసుకోవటానికి అనుమతి కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వెళ్ళగా అధికార పార్టీకి చెందిన నాయకుడు దూషించాడని పేర్కొన్నారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టించి ఆదేరోజు అట్రాసిటి కేసు పెట్టించాడన్నారు. సాక్ష్యులు కూడా తమకు తెలవదని, అక్కడి వెళ్తే తమ పేర్లు పోలీసులు పెట్టారని చెప్పిన వీడియో ఉందన్నారు. అధికార పార్టీ ప్రతినిధులు బెదిరిస్తున్నారని, తనకు ఏమైనా జరిగే వారిదే బాధ్యత అన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


తుర్కలమద్దికుంట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెద్దపల్లి ఈద్గా వద్ద ఎమ్మెల్యే విజయరమణారావు, పోలీసు అధికారులు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా వద్ద ఉదయం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులపాటు ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో జరుపుకున్నారు. ఉపవాసదీక్షతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, ధాతృత్వం సోదరభావం పెంపొందుతాయన్నారు. పోలీస్ అధికారులు ఏసీపీ కృష్ణ, సీఐ ప్రవీణ్, మున్సిపల్ అధికారులు, మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): ప్రేమ, త్యాగానికి ప్రతీక రంజాన్ పండుగ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఫోరింక్లయిన్ వద్ద జరిగిన రంజాన్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని మతాల ప్రజలు సేవాభావంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశామని, రామగుండం నియోజకవర్గంలో ఈద్గాలు, కబరాస్థాన్‌ల అభివృద్ధికి రూ.4కోట్లు, షాదీఖానాకు రూ.2కోట్లు మంజూరు చేయించానని, ఫోరింక్లయిన్‌గడ్డ వద్ద ఉన్న ఈద్గా చుట్టూ ప్రహరి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల అభివృద్ధితోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని, రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాయకులు ఆసీఫ్, ఫజల్‌బేగ్, నజీమోద్దీన్, ఖాజా ఫక్రుద్దీన్, అశ్రఫ్, ముస్తాఫాతో పాటు ముస్లీంలు పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని మజీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా జరుపుకున్నారు. మండ లంలోని తుర్కలమద్దికుంట, అప్పన్నపేట, పెద్దబొంకూరు, పెద్దకల్వల, గౌరెడ్డిపేట, ముత్తారం, రాఘవపూర్, అందుగులపల్లి గ్రామాల్లో ముస్లిం సోదరులు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, గుంపుల, ఓదెల గ్రామాల్లోని మజీద్‌లలో ఇమామ్‌లు ప్రసంగించారు. ప్రార్థనలు పూర్తయిన తరువాత గ్రామాల్లోని పలు పార్టీలకు చెందిన నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిసేటి రాహుల్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పవిత్ర ప్రార్థనలో ముస్లిం సోదరులు నూతన దుస్తులు ధరించి నమాజ్ చేశారు. నెలరోజులపాటు ఉపవాసం, ప్రార్థనలో గడిపిన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ముస్లిం మత గురువు అబ్దుల్ ఆసీం అన్నారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద రంజాన్ వేడుకలను నిర్వహించారు. ముస్లింలంతా సామూహిక నమాజ్ చేశారు. అనంతరం కుల మతాలకు అతీతంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీద్ కమిటి అధ్యక్షుడు ఎండీ బాబ, గౌరవ అధ్యక్షుడు ఎండీ గౌస్, ప్రధాన కార్యదర్శి ఎండీ మేరాజ్, కోశాధికారి ఎండీ యూనుస్, ఎండీ హుస్సేన్, అబ్దుల్ ముజాహిద్, ఎండీ సలాం, ఎండీ రఫీ, హఫీజ్, మిస్బా, అవేజ్, షోయాబి మతీన్, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీమండలఅధ్యక్షుడు సదయ్య, శ్రీదేవిరాజు, సతీష్ పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని ఎన్టీపీసీ ఏరియాలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థన లు చేసిన ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాం క్షలు తెలుపుకున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ ఎన్టీపీసీ ఎన్‌బీసీ సభ్యుడు, ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా ఇంటికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈద్గాలో ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలిపారు. రఫీఅహ్మద్‌ఖాన్, ఇంతియాజ్, మతిన్‌ఖాన్, అల్తా న్‌ఖాన్, వసీంఖాన్, మేరాజ్‌ఖాన్, హ బీబ్, తాజ్, జమీల్ పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ కోలేటి మారుతి, సింగిల్‌విండో చైర్మన్ ఇనుగంటి భాస్కర్ రావు, శంకర్, మురళీధర్‌రావు, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ,సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. అల్లా దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాక్షించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాసర్లగడ్డ వద్ద, అడవి శ్రీరాంపూర్, ఓడేడు మజీదు వద్ద ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలను చేపట్టారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు ఒకరికి ఒకరు తెలియజేసుకున్నారు. రాజకీయ నాయకులు హాజరయ్యారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం నీరుకుళ్ళ రోడ్డులోని ఈద్గా వద్దకు నూతన వస్త్రాలు ధరించి ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మాట్లాడారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. సుల్తానాబాద్‌లో నవాబ్, సలీం, ఎండీ అమీనొద్దిన్‌నన్ను, హైదర్, అజహరోద్దిన్, మోబిన్, రఫీ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే విజయరమణారావు పలువురు ముస్లిం నేతల నివాసాలకు వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, సాయిరి మహేందర్, బిరుదు సమత క్రిష్ణ, రాజలింగం, తిరుపతి, మెంగని శ్రీనివాస్, టీకే ప్రభాకర్ పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షలను ముగించిన ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నాయకులు ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎండి గౌస్‌పాషా, ఎండి పకీర్, ఎండి అంకూస్, ఎండి పజలుల్లా, ఎండి చాందుపాషా, ఎండి రహెమద్ పాషా, ఎండి రఫిక్, లాల్‌మహమ్మద్, షాబొద్దిన్, పలువురు పాల్గొన్నారు.

గంగానగర్ నుంచి బీ పవర్‌హౌస్ వరకు ఫ్లై ఓవర్ నిర్మించాలి


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు పోతున్నా హెచ్‌కేఆర్ రోడ్డు సంస్థ పట్టించుకోవడం లేదని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు మండిపడ్డారు. ప్రమాదాలకు నిలయంగా మారి నిత్యం వాహనాలు బోల్తాపడుతున్నా మూలమలుపును సీపీఐ బృందం సోమవారం పరిశీలించింది. ఆదివారం రాత్రి జీఎం కాలనీ రాజీవ్ రహదారిపై యాష్ ట్యాంకర్ బోల్తా పడిందని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ఇప్పటికే 50 వాహ నాల వరకు బోల్తా పడినా హెచ్‌కేఆర్ సంస్థ, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. గంగానగర్ నుంచి రామగుండం బీ పవర్‌హౌస్ వరకు ఫ్లై ఓవర్ నిర్మించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. లేకపోతే టోల్‌గేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బ్రిడ్జిల నిర్మాణం కాకముందే నిబంధనలకు విరుద్ధంగా టోల్ ట్యాక్స్‌ను ఎలా వసూలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. జీఎం కాలనీ వద్ద ఉన్న మూలమలుపును విస్తరించి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు. మోహన్, గౌతం గోవర్ధన్, మల్లయ్య, ఓదమ్మ, రమేష్ కుమార్ ఉన్నారు.

రాజీవ్ రహదారిపై బూడిద ట్యాంకర్ బోల్తా

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై గోదావరిఖని జీఎం కార్నర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి తరువాత బూడిద ట్యాంకర్(కేఏ32సీ7417) బోల్తా పడింది. మంచిర్యాల జిల్లా జైపూర్ విద్యుత్ కేంద్రం నుంచి లిక్విడ్ బూడిద లోడ్‌తో వెళుతున్న లారీ జీఎం ఆఫీస్ కార్నర్ వద్ద అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపై పడింది. ఆ సమయంలో సర్వీస్ రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఎన్టీపీసీ ప్లాంటులో నాగుపాము


నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ షఫి

జ్యోతినగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో సోమవారం ప్రాజెక్టులోని 500 మెగావాట్ల 5వ యూనిట్ మిల్ ఏరియాలోకి నాగుపాము వచ్చింది. పామును చూసిన కార్మికులు వెంటనే షిఫ్ట ఇన్‌చార్జికి సమాచారం ఇచ్చారు. తక్షణం స్పందించిన అధికారి స్నేక్ క్యాచర్ షఫీని పిలిపించారు. పామును సమీపంలోని అడవిలో విడిచి పెడుతానని షఫి తెలిపారు. ఇటీవల ఎన్టీపీసీ ప్లాంటు పరిసరాల్లో తరుచూ పాములు వస్తుండడంతో కార్మికులు భయపడుతున్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



జూలపల్లి, మార్చి 31. (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని మంథోట ఏరియాలో సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావు సోదరుడు స్వర్గీయ చింతకుంట సుధాకర్‌రావు స్మారకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన వారాహి ఆగ్రోఏజెన్సీస్ షాపును ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, సామరాజేశ్వర్‌రెడ్డి, నాయకులు జలపతిరెడ్డి, అతీక్‌పాషా, సిరికొండ కొమురయ్య, ఎండి గౌస్‌పాషా, బండి స్వామి, కనకట్ల నర్సింగం, రాగల్ల రవి, పలువురు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ వారసంతలో చలివేంద్రాన్ని యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ రాజ్‌కుమార్ ఏర్పాటు చేశారు. ప్రతీ సోమవారం జరిగే వారసంతకు ఇటుక బట్టీలు, రైస్ మిల్లుల్లో పనిచేసే కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున వస్తారు. మిట్టపల్లి ప్రవీణ్ సౌజన్యంతో చలివేంద్రాన్ని ప్రారంభించారు. మల్లేశం, కందునూరి కుమార్, పూసాల రామక్రిష్ణ, శెట్టి శ్రీనివాస్, పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి మిత్రుల సహాయం

ఓదెల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందిన ఓదెలకు చెందిన రాచర్ల శంకర్ కుటుంబానికి చిన్ననాటి మిత్రులు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని మిత్రులు అల్లం సతీష్ తెలిపారు. మాజీ ఎంపీటీసీ బోడకుంట కుమారస్వామి, గుర్రాల సతీష్, ఆవుల శ్రీధర్, క్యాతం సంతోష్, సూత్రాల శ్రావణ్, దాసరి కోటి, ముంజాల మధు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగికి ఆర్థికసాయం

పెద్దపల్లి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గుర్రాంపల్లి ఆశ కార్యకర్త ఈర్ల లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా తోటి కార్యకర్తలు రూ.21వేలు జమ చేసి వారి కుటుంబానికి అందించారు. ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన మృతురాలు ఈర్ల లక్ష్మీని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు, ఎవరైనా దాతలు ఉంటే సహకారం అందించాలన్నారు. అనవేణ స్వరూప, శోభ, మామిడి పద్మ, ప్రేమలత, రాధిక, గడ్డం స్వరూప, రమాదేవి, లక్ష్మీ, సముద్రాల పద్మ, రొడ్డ పద్మ, మానసలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వివేక్


ఆలయంలో వివేక్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

గోదావరిఖని, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సోమవారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సందర్శించారు. ఏప్రిల్ 2 నుంచి జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే వివేక్‌ను గౌడ సంఘం నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, బాలసాని స్వామిగౌడ్ కోరారు. ఎల్లమ్మ ఆలయానికి తన సహాయ సహకారాలు అందిస్తానని వివేక్ చెప్పారు. అనంతరం వివేక్‌ను గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంగ శ్రీనివాస్, సిరిశెట్టి తిరుపతి, నాగభూషణం, పొన్నం అంజయ్య, మోడెం సురేందర్, లడ్డు, వంగ లక్ష్మీపతి, రాంమూర్తి, శ్రీనివాస్, శ్రీధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి


ఉగాది ఉత్సవాల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో రామగుండం నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆకాంక్షించారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గోదావరిఖనిలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో జరిగిన ఉగాది ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు, రెడ్డి కులస్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈద జగన్మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చింతల రాజిరెడ్డి, ఉమ్మెంతుల దేవేందర్‌రెడ్డి, కోశాధికారి చందుపట్ల తిరుపతిరెడ్డి, అధిక సంఖ్యలో రెడ్డి కులస్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


కవి సమ్మేళనంలో కవులకు సన్మానం

ఖనిలో ఘనంగా కవి సమ్మేళనం

కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవ త్సరం ఉగాది సందర్భంగా సోమవారం గోదావరిఖనిలో కవి సమ్మేళనం నిర్వహించారు. మార్కండేయకాలనీలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో జరిగిన సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని కవితగానం చేశారు. కవి ఏలేశ్వరం వెంకటేష్, పోచయ్య, లెనిన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు కళ తెలంగాణ సంస్కృతిలో ఒక భాగం

మంథని, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒగ్గు కళ తెలంగాణ సంస్కృతిలో ఒక భాగమని తెలంగాణ రాష్ట్ర ఒగ్గు పూజార్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కావేటి భూమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పండగా సందర్భంగా ఒగ్గు కళాకారులను ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఒగ్గు కళాకారులను, పూజను ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదరించడం సంతోషకరమన్నారు. ఈ కళను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు తిరుపతియాదవ్, మక్కాపల్లి రాజమల్లుయాదవ్, చీర్ల గట్టయ్య యాదవ్, గాలి ఐలయ్యయాదవ్, నక్క మొగిలియాదవ్, మొడయ్యయాదవ్, కావేటి చంద్రమౌళి, సమ్మయ్య యాదవ్‌లు పాల్గొన్నారు.

మే 20న సమ్మె

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న అన్ని పరిశ్రమలతోపాటు బొగ్గు పరిశ్రమలో సమ్మె చేయాలని ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ 11వ జాతీయ మహాసభల్లో తీర్మానం చేసినట్టు సీఐటీయూ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. రాంచీలో జరిగిన ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలు విజయవంతమైనట్టు తెలిపారు. దేశంలోని బొగ్గు సంస్థల పరిరక్షణతో పాటు కార్మికవర్గ సమస్యల పరిష్కారం దిశగా దేశవ్యాప్తంగా 10 సంఘాలు పబ్లిక్ సెక్టార్ అసోసియేషన్లు కలిసి ఆందోళన చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగిందని, సింగరేణి నుండి కమిటీ ఉపాధ్యక్షులుగా తుమ్మల రాజారెడ్డి, కార్యదర్శులుగా మంద నరసింహారావు, అల్లి రాజేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రవీణ్ తెలిపారు.